ఆకాశం కొసల్నిండా వింత వింత రంగులు, క్షణం క్షణం రూపాలు మార్చుకుంటున్న మబ్బులు. మలి వెలుగు. అదీ సంధ్యాకాలం. అసురసంధ్య ఆలోచనలను రెట్టింపు చేస్తుం దంటారు. మానసికంగా క్రుంగిపోయే వ్యక్తిని మరింతగా బెంబేలెత్తించే ఘనత కూడా అసుర సంధ్యదే నంటారు.

అలాంటి ఒక సంధ్యవేళ, ఇంటి ముందు తాను మురిపెంగా పెంచుకున్న మల్లె పందిరి కింద కూర్చున్నా పరిసరాలు పరిమళిస్తూ పరామర్శిస్తున్నా సుజాతమ్మ మనసు దహించుకుపోతూనే ఉంది. యౌవనం తాలూకు పరవళ్ళు, వయసు వలవరింతలు, వలపు పులకరింతలు ఇవేవి తనకు అచ్చి రాలేదు. కాదు; అహంతో, అతిశయంతో తానే వాటిని తనకు దూరం చేసుకుంది. అహంకారం నడలి, మూర్ఖత్వం వదిలి లోకం అర్థమయ్యే నాటికి తన కోసం వచ్చిన ప్రతి అవకాశం కొండెక్కి పోయింది. ఇప్పుడు చైతన్యం ఇంకిన బ్రతుకు, ఏ స్పందనలూ, అనుబంధాలూ లేక నిస్పృహతో నిండిన జీవితం.

సుజాతమ్మ మనసులో మసకమసకగా, బరువు బరువుగా ఆలోచనలు. ఆ ఆలోచనల్నుంచే రూపం దిద్దుకొంటున్న గతం. తనకు తానే నిర్లక్ష్యంగా ప్రవర్తించిన గతం; ఆమె గుండెలో రగులుతున్న మంటలు. సుజతమ్మకు ఎదురుగా గోరింటాకు చెట్టు. తన చేతుల మీదుగానే నీళ్ళు పోసి పెంచినపుడు చిన్న మొక్క అది. ఇప్పు డది ఇంతింతై అన్నట్టు రెమ్మలు కొమ్మలై. కొమ్మలు విశాలమై కాలంతో పాటు ఏపుగా పెరిగింది. మరి తనో?



# వయసే ఒక వరం

డా॥ పి.వి.రమణ

అల్లారుముద్దుగా పెరిగిన బాలిక. అడిగిందీ, అడగందీ తన కందించే తల్లిదండ్రుల మధ్య అపురూపంగా తిరిగిన అందాల యౌవన ప్రాంగణంలో అడుగులు వేసి, ఇప్పుడు నడి వయసులో చిక్కు పడ్డది. సుజాతమ్మ బ్రతుకులో కాలం తెచ్చిపెట్టిన శరీర మార్పు తప్ప, ఏ వలపు పందిళ్ళుగానీ, ఏ వసంతాల సందళ్ళుగానీ లేవు. ఏ అనుభూతుల ఆలరింపులూ లేని శూన్య జీవితం తనది.

సుజాతమ్మ గుండెల నిండా దైన్యం చెమ్మగిల్లిన కళ్ళు; నిన్నగాక మొన్న జరిగిన సంఘటనే ఆమె హృదయాన్ని తొలుస్తున్నది. వెన్నెలను చూడటం చేతగాక, అమావాస్యదాక వేచి, దాని చిక్కటి నీడలను మాత్రమే చూసి అసంతృప్తి చెందినట్లు దయనీయమైన అనుభూతి ఆమెలో. ఆ నీడల్లోనే మొన్న జరిగిన సంఘటన.

"రాధా... ని న్నొక విషయం అడగనా?" ఏదో ఆరా తీస్తున్నట్లుగా గాక వాస్తవం తెలుసుకోవాలన్న తహతహ తనలో.

ఆశ్చర్యంగా తనవైపు చూస్తున్న రాధ చూపుల్లో చూపు కలిపే శక్తి లేక "మీ ఆయన తాగుతాడట కదా! మరి నువ్వు....?"

పెద్ద పెట్టున నవ్వింది రాధ; ఇంత పిచ్చి ప్రశ్నా అన్నట్లు ఆ తరువాత "లక్షణంగా ఉన్నాను. మీ రెవ్వరూ ఊహించనంతటి సుఖంగా ఉన్నాను. అంతేగాదు. నా గురించి నేనుగా ఏమీ ఆలోచించుకోవలసిన అవసరం లేనంత జాలీగా ఉన్నాను సరా?" రాధ కళ్ళల్లో అవే మెరుపులు.

"తాగినవాళ్ళు రాక్షసంగా ప్రవర్తిస్తారట. మరి నువ్వు సర్దుకుపోగలుగుతున్నావా?"

"పిచ్చి సుజాతా, ఆయన కిప్పుడు తాగే అవసర మేముంది?"

"అంటే....!"

"నన్నే తాగుతున్నారుగా, క్షణం విడిచిపెట్టక" చిలిపిగా, సిగ్గుగా అంది రాధ.

"మరి... మరి... తాగే వాళ్ళు" భాష అందని భావం తనలో.

"సుజాతా ! నా పట్ల నీ ఆలోచన. నా కాపురం గుర్చి నీ భయం అర్థమైంది. కొందరు తాగటం కోసమే బతుకుతారు. వాళ్ళను చూస్తే అందరికీ భయమే. కొందరు బతకటం కోసం తాగుడు నాశ్రయిస్తారు. కొందరు బతకటం చేతగాక, సర్దుకు పోవటంతో రాజీపడక తాగుతారు. ఆయన ఈ రెండో తరహాకి చెందిన మనిషి అన్న విషయం ఆయన్ని చూడగానే గ్రహించగలగటం నా అదృష్టమేనేమో! ఏ భయంకరమైన బాధామయ స్మృతినో మరిచిపోవటానికే ఆయన తాగుడును అలవాటు చేసుకొన్నారన్న నమ్మకం నా కేర్పడింది. ఓదార్పు, ఉపశమనం, అనునయాల ద్వారా ఆయన కేర్పడ్డ లోటును నేను పూరించగలిగితే ఈ వ్యాపకాన్ని ఆయన పూర్తిగా విస్మరిస్తారన్న విశ్వాసం గూడా నాలో కలిగింది. పైగా మా వివాహానికి ముందు ఎంతో నిష్కల్మషంగా, నిజాయితీగా ఆయన నాతో అన్న మాటలు గూడా నన్ను ఆలోచింపచేశాయి. అంతేగాక ఆయనపట్ల గౌరవాన్ని ఏర్పరాయి."


"ఏమి టా మాటలు? నేనూ వినొచ్చా?" సందిగ్ధంగా అడిగింది తను. తన మనసులో చెలరేగిన ఏ భావాన్నీ ముఖంలో బయటపడగూడదన్న జాగ్రత్త పడింది. అయినా రాధతో ఆయన అన్న మాట లేమిటో అన్న ఉత్కంఠ తన నరనరంలో.

"రాధగారూ! ఈ పెళ్ళి చూపులూ, అనుభూతులూ ఇప్పుడు నా విషయంలో అర్థం లేనివి. ఇవి కావాలని కోరుకునే మనసూ కాదు. వయసూ కాదు నాది. అవన్నీ గడిచిపోయిన స్మృతులు నాకు. అయితే 'సహధర్మచారిణి'గా మీరు నా జీవితంలోకి రావటానికి ముందే మీకు కొన్ని ముఖ్య విషయాలు చెప్పటం నా ధర్మం..

రాధగారూ! నేను అప్పుడప్పుడు తాగుతాను. డ్రింక్స్ మీద ఇష్టముండి కాదు. ఎందుకో వివరించి చెప్పలేను గానీ, కొన్ని సమయాల్లో అట్లా తాగే నన్ను నేను రక్షించుకొంటాను. మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు రాధగారూ! కానీ ఇది నిజం. ఆమె నన్ను ఏకాకిని చేసి ఈ లోకం నుండి వెళ్ళిపోవడమే కాదు. ఈ లోకంలో నాకూ ఏదీ మిగల్చకుండా చేసి నన్ను ఒంటరివాణ్ణి చేసింది. సుఖంగానీ, దుఃఖం గానీ మాకు మేం వేరుగా అనుభవించలేదు. ఏ సందడినైనా, సంబరాన్నైనా మేం కలసి పంచుకొన్నాం. ఇప్పుడు ఆ లోటు నన్ను నిర్వీర్యుణ్ణి చేసింది. స్తబ్దుణ్ణి చేసింది. బ్రతుకు పట్ల చెప్పరాని అసంతృప్తినీ, అయిష్టతనూ పెంచింది.

నాలో ఆత్మహత్యా కోరిక బలాన్ని పుంజుకునేది. దానికి బలాన్నిస్తూ మెదడులోని నరాలన్నీ పోరు పెట్టేవి. అలాంటప్పుడే ఆ ఆలోచనలకు తావీయకుండా, మనసు పని చేయకుండా విషం వంటి ఈ మందే నాకు ఔషధంలా దిక్కవుతుంది. క్రమంగా ఆ భయంకరపు స్థితి నుంచి బయట పడ్డాక నాలో నేనే, నా బలహీనత పట్ల అసహ్యంతో కుమిలిపోవటం, సంఘంలో వెలితిపడటం, అన్ని విషయాలూ తెలిసిన మిత్రు లనబడే వాళ్ళు కూడా నా పట్ల చేసే విరుద్ధ ప్రచారానికి క్రుంగిపోవటం ఇదీ నా జీవితంలో అప్పుడప్పుడూ నే నెదుర్కొనే భయంకర స్థితి. నా బాధ్యతగా, అవసరంగా మీకు ఈ విషయం చెప్తున్నాను. జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయాన్ని తీసుకోండి. నాపట్ల సానుభూతితో కానీ, అసహ్యంతో కానీ మీ నిర్ణయం ఉండగూడ దన్నదే నా భావం అంటూ నా కళ్ళలోకి అర్థవంతంగా చూశా రాయన.

"సుజాత! ఆయన చెప్పిన తీరూ, ఆ తీరులోని నిజాయితీ నన్ను ఆకట్టుకుంది. అంతే గాదు. భార్య పోయిన శోకాలు ఇంట్లో ఇంకా సమసిపోకముందే కామంతో కాగిపోతూ, వేరే వివాహం కోసం వెర్రెత్తిపోయే ప్రబుద్ధులున్న ఈ రోజుల్లో ఏనాడో గతించిపోయిన ఆ ఇల్లాలి పట్ల ఆయన పెంచుకొంటూ వచ్చిన మమతానురాగాలు కూడా నన్ను ముగ్ధురాలిని చేశాయి. ఆయన ఔదార్యం నన్ను మరింత సన్నిహితం చేయటమే గాక, ఆయన స్థితిపట్ల సానుభూతిని కలిగించింది." చెప్తున్న రాధ




వదనంలో ఆత్మీయతా వాత్సల్యాల తాలూకు భావాలు తరట్లాడాయి. ఆమె కంటి పాపల్లో జీవిత పరిపూర్ణతను చాటిచెప్పే పారవశ్యం తాలూకు వెలుగులు.

సుజాత భ్రుకుటి ముడిచి రాధను చూసింది. ఏవో విషాదస్మృతులు ఆమె మనసును కవ్వంలా చిలుకుతున్నై. రాధ మాటలు సుజాత అంతరంగాన్ని మంచులో ముంచినట్లయింది. సరిగ్గా ఈ విధంగానే పెళ్ళి చూపులకి తనను చూడటానికి వచ్చినపుడు అతను చెప్పాడు. తనెంత తిరస్కార భావంతో చూసిం దతన్ని ఆ తరువాత ఈ సంబంధాన్ని చచ్చినా చేసుకోనని ఎంత రాద్ధాంతం చేసింది ఇంట్లో! ఆ తర్వాత అతను రాధను చూడటం, రాధ ఇష్టపడడమే కాక, ఈ మనిషి భర్తగా లభించటం ఒక వరం లాంటిదంటూ మురిసిపోవటం.

తను పగిలిన కుండ అంటూ పారవేసింది. అపరంజి పాత్ర? అది రాధ పరమైంది. ఒక పుట్టలో పాము కన్పిస్తే ప్రతి పుట్టలోనూ పాము ఉంటుందనేది తన భ్రాంతి. ఈ భ్రాంతే తన జీవితాన్ని వంచించింది. రాధ జీవితాన్ని వసంతంగా మార్చింది. అసలు ఆ మాట కొస్తే అతను తాగుతాడని ఎవరో చెప్పడం గాక అతనే స్వయంగా తనతో ప్రస్తావించాడు. తాను ఈసడింపుగా చూసింది. సుజాత మనసు అశాంతితో మగ్గిపోయింది. హృదయంలో ఆవిర్లు కమ్ముకొ తున్న అశాంతి సెగలు.

"సుజాతమ్మా! సుజాతమ్మా!" పక్కింటి బామ్మగారు గోడపైనుంచి తలపెట్టి పిల్చింది. తన మనసులో భావం మనే యవనిక మాటునే ఉండిపోయింది.

**అదన్నమాట!**

ఓ పార్టీలో ఇద్దరు భూస్వాములు కలిసి ఎవరి గురించి వాళ్ళు గొప్పలు చెప్పుకుంటున్నారు.
మొదటి అతను : అయితే మీకు ౫౦ ఎకరాలున్నాయా! అంతేనా? నాది అయితే పొద్దున్న ఈ అంచున కారులో బయలుదేరితే మర్నాటి మధ్యాహ్నానికి కూడా అటు చేరం.
రెండో అతను: ఓహో! అయితే మీరు కారు తోసుకుంటూ వెళ్తారన్నమాట!

- జి. వైశాలి [సికింద్రాబాదు]

"ఏమిటమ్మా అట్లా పరధ్యాన్నంగా కూర్చున్నావ్ ఇంట్లో దీపమన్నా వేయక? చీకటింటిని చూసి నీవు ఉన్నావో, లేవో అని ఇందాకట్నుంచీ పిలుస్తున్నా. సమాధానం రాలే."

"ఏంలేదు అక్కయ్యగారూ. ఏదో బడలికగా ఉండి" తొట్రుపడుతూ సమాధానం ఇచ్చింది సుజాతమ్మ.

ఈ వయసులోనూ బామ్మగారికి ఎవరైనా 'అక్కయ్యగారూ' అని పిలిస్తే, ఆవిడకు పరమానందం. అట్లా పరామర్శిస్తుందనే సుజాతమ్మ అంటే ఆమెగారికి ప్రత్యేక అభిమానం.

పెద్ద పెట్టున నిట్టూర్పు విడుస్తూ అంది బామ్మగారు. "అంతేనమ్మా తోడులేని బ్రతుకులు మనవి. ఏ వేళకు ఏది చేసుకోవాలన్నా మనసు రాదు. ఇంతెందుకు; ఆయన పోయిన కొత్తలో నేనూ ఇట్లాగే ఒంటరిగా కూర్చుని ఏడ్చేదాన్ని. ఓ అచ్చటా ముచ్చటా ఏముంటాయి చెప్పు?"

సుజాతమ్మ మనసు చివుక్కుమంది బామ్మగారు తెచ్చిన సాపత్యంతో; అన్నీ ఉడిగిపోయిన ఆమె గూడా తన బ్రతుకులోని ఇప్పటి వెలితిని పూడ్చరానిదే అన్నట్టు శ్రుతి కల్పటం అయిష్టంగానే కాదు, అసహ్యంగా కూడా అనిపించింది సుజాతమ్మకు. పెళ్ళి విషయంలో తెలిసో తెలియకో తాను తాత్సారం చేసింది. అయినా ముప్పయి అయిదు సంవత్సరాలు దాటుతున్న అవివాహిత తను. అన్ని అనుభవాలు పొంది, చివరి దశలో ఉన్న మామ్మగారు తనతో జత కల్పుకోవటం సుజాతమ్మకు మింగుడు పడనట్టుగా ఉంది. ఇంకా మామ్మగారు ఏదో చెప్పబోతుండగానే లేచింది సుజాతమ్మ.

"ఎక్కడికమ్మా?"

"లైటు వెయ్యాలి అక్కయ్యగారూ" అంటూ వరండా వైపు నడిచింది సుజాతమ్మ. కలిసి వచ్చిన కాలక్షేపం సగంలోనే దూరమైపోయినందుకు డీలా పడిపోయి- రాతలో ఉండాలి గానీ, లైటు వేస్తేనే బ్రతుకులో వెలుగొస్తుందా సణుక్కుంటూ గోడమీద నుంచి తల క్రిందికి దించారు మామ్మగారు.

లోనికి వచ్చి లైటు వేసింది సుజాతమ్మ. గదంతా వెలుగు పర్చుకుంది. ఎక్కడి వస్తువు అక్కడ ముచ్చటగా అమర్చినట్లున్నై. ఈ

# నేనెవర్ని?

డా. కె.బి. గోపాలం

నేను ఊహల ఉద్రేకాల పుట్టను
చరిత్ర మిగుళ్ళు తిని బలిసిన
నేను ప్రేరణలూ - పూరణల కట్టను
ఒక కాలు అటవిక యుగంలో
ఇం కొక కాలు అంతులేని నాగరికతా పథంలో

నేను నిర్భేద్యుడిని
సమస్త సామగ్రీ కలబోసి చేసిన మాయబొమ్మను
నేను నిశ్శబ్దాన్ని
ఈమత్తులో నన్ను నేను చిత్తు చేసుకోవాలని ఈ మత్తులో
నా ఆశల గుత్తులను ఎత్తుగా పేర్చుకోవాలనీ నే నీ కాలమంతా
వృథా చేశాను గదూ!
ఏనాడో, మాత్రమే, శ్రుతిలో కొన్ని స్వరాలు పలికిన
ఈనాడు మాత్రం పనికిరాక మూలపడిన
వాయిద్యాన్ని నేను ఆ నాటి శ్రుతుల్లో అక్షరాల్ని
నా సంతకాల్ని వెతుక్కుంటున్నాను.

నా సంతకం ... ఎవరికి కావాలి నా సంతకం....
మెరుపు మెరిసి ముక్కలయింది
మనుపల్ని పిశ్చెత్తినట్లు మధ్యలోకి విరిచేసింది.
మిడతల దండు పొలాలని మింగేసింది
వరదలు కొండలని కూడా ముంచేశాయి.
భూ కంపా లింకా ఆగనే లేదు
ఇవి నా సంతకాలు - ఇవే నా సంతకాలు.

నేను ఈ పుస్తకాల్లో, ఈ కథల్లో, ఈ కావ్యాల్లో, ఈ పత్రికల్లో
ఈ ప్రసంగాల్లో మునిగి ఉండకపోతే
ఈ సమాచార ప్రపంచంలో కరిగి ఉండకపోతే
అనామకుడిని అయ్యుండే వాడినా?
అస్తవ్యస్త మయిన అక్షరాల లాగ మిగిలి ఉండేవాడినా?
అప్పుడే బాగుండే దేమో! ఇం కేదన్నా మంచి ఆలోచనన్నా
వచ్చి ఉండేది.

నా కళ్ళకీ, నా చెవులకీ నేను అనర్హుణ్ణి
నా ఊహలు మాత్రం ఏటిపక్క కొంగలూ, రాత్రి పూట దొంగలూ
ఆకలిగొన్న సివంగులూ -
నా ఎదనే రహదారిగా వస్తున్న - నా ఊహలు మాత్రం నావే!
తమ అత్యుత్తమ మేథలనీ, ఆలోచనల కరుకు నోట్లనీ,
నమ్మేవాళ్ళని పిలవా లని ఉంది. అమ్మేవాళ్ళని అదిలించాలని
ఉంది.
నమ్మండి బాబూ! మీరు నమ్ముకున్న ఈ చిల్లర నాణేలు ఈ
నాడు చెల్లవు. మీ కింకా తెలియనే తెలియదు పాపం!
మీ బొమ్మలనీ, బొరుసులనీ, పూగ్ ఫొర్ ఆల్ - పులి బొమ్మలతో
సహా తిరిగి తీసుకోండి, జేబుల్లో దాచుకోండి.
ఆ మీ మాయలన్నీ ఆనాడే అయిపోయినయి.
తాతలు వదిలిన దేశంలో, అరువు తెచ్చుకున్న దృశ్యాల్లో,
అడుక్కు తెచ్చుకున్న బొమ్మల్లో బ్రతుకుతున్నా మని ఒప్పుకోండి

వీ టన్నిటికీ మీరు వెల చెల్లిస్తే
మీ ప్రాణాలతో
ఆకలి గట్టున - ఆ మైదానం - ఆ రహదారీ - అన్నీ వదిలేసి
మీ మార్గాన, ఊహాగమ్యం నుంచి ఊహా గమ్యానికి
అంతులేని యాత్ర అప్పు డర్థ మవుతుంది.
నీడలాంటి నిద్ర - రెక్కలొచ్చి అగాథంలోంచి ఆకాశానికి
ఎగిరిపోయింది
ఒక మనిషి ఇం కొకడిని కరవకపోతే అరవకుండా వదిలేస్తే ...
ఓ మానవతా - అదుగో అంతంత దూరం
అసింటా! అంతంత దూరం.
నాకు కోపం - ఆదీ అంతం లేని కోపం -/ఆనాటి హిమయుగపు
కోపం - అందరూ అంటున్నట్లు ఈ యుగం అంతమయితే
ఈ చక్రం ఆగితే - అభ్యంతరమా?
నే నెవర్ని -
నన్ను నేను గుర్తించని నే నెవర్ని? ★

అమర్చిన తీరు తనకే గాక, తన ఇంటికొచ్చిన వారందర్ని ఎంతగానో మురిపింప చేస్తుంది. సుఖం కోసం, ఆనందం కోసం, సంతృప్తి కోసం మనిషి పడే ఆరాటమే ఈ వస్తు సేకరణ. ఇది ఇప్పటిదా? తను తన నివాసాన్నే ఇంతగా తీర్చి దిద్దుకుంది గాని, జీవితంలో తోడును సంపాదించుకోలేకపోయింది. అర్ధాంగిగా, అపురూపంగా చూసుకొంటామంటూ ఎందరో తన సాన్నిహిత్యాన్ని కోరి వచ్చి ఎంతగా ప్రాధేయపడినా తాను తిరస్కరించింది. తన అందం మీద నమ్మకంతో ఆ వచ్చిన వారిలో ఏవేవో లోపాలు ఎన్నటంతో ఇలా ఒంటరిగా మిగిలిపోయింది.

తలంత భారంగా అనిపించి పక్క మీద వాలిపోయింది సుజాతమ్మ. చేజేతులా చేసుకొన్న దానికి కుములుతూ ఎదురు దెబ్బలు తన హృదయంపై శాశ్వత ముద్రలు వేసికొన్నాయి.ఇపుడు ఆ ముద్రలే విరాట్రూపాలతో తనకు మృత్యుతీరం చూపిస్తున్నట్లు, తన అహమే కన్నీరై, ఆ కన్నీరే ఉగ్ర కడిలియై తన మీదకే విరుచుకు పడుతున్నట్లు సుజాతమ్మ నవనాడులూ కదిలిపోయేట్లు కల్లోలపడిపోయింది. భయంతో గట్టిగా కళ్ళు మూసుకుంది. మూసుకున్న ఆ కన్నుల ముందు విచ్చుకత్తులతో దాడి చేసే గతం. ఆ గతం లోయల్లో నుంచి తరలి వస్తున్న సంఘటనల పరంపరలు.

ఆ రోజు నిజంగా తన కేదో దయ్యం పట్టినట్లూ, పూనకం పట్టినట్లూ ప్రవర్తించింది. అలా ఎన్ని సంఘటనలూ!

"ఏదమ్మా ఒక్క పాట పాడు" పెళ్ళి చూపులకొచ్చిన పెళ్ళికొడుకు తల్లి కోరింది. చివ్వున తలెత్తింది తాను. అర్థం లేని ఏదో కసి, పిచ్చి ఆవేశం. "ఏం ఎందుకు పాడాలి? పాడితేనే చేసుకుంటారా? మీ అబ్బాయికి క్రికెట్ వచ్చా మరి? నాకు క్రికెట్ అంటే క్రేజ్; ఏదీ ఆడమనండి." వెటకారంగా, నిర్లక్ష్యంగా తను అరిచే సరికి ఆ వచ్చిన వాళ్ళు క్షణకాలం నిశ్చేష్టులై, నిర్విణ్ణులై ఉండగా తను ఒక హెచ్చరికలాంటి ఉపదేశం చేసింది.

"అనవనరమైన చెత్త విషయాలు ఇహముందైనా అడక్కండి; మీ క్కావలసింది కట్నం. అది మా నాన్న దగ్గర సిద్ధంగా ఉందో, లేదో చూసుకోండి ముందు.

తొట్రుపడి పెళ్ళి చూపులకొచ్చిన వ్యక్తి అవమానంతో, భయంతో బిగునుకుపోయిన అతని తల్లిదండ్రులూ, మరో మాట పడడం ఇష్టం లేనట్లు చప్పున లేచి వెళ్ళిపోయారు. ఆశ్చర్యంలో చూస్తున్న తన తల్లిదండ్రుల ముందునుంచే తాను విసురుగా లోపలికి నడిచిన తీరు.

సుజాతమ్మను ఆవహించి విచ్చలవిడిగా స్వారీ చేస్తున్న గతం తాలూకు జ్ఞాపకాలు, వాటికి గొడుగు పట్టిన తన ప్రవృత్తి తాలూకు స్మృతులు తన నరనరాల్లోనూ స్వరాలెత్తి నాదం చేసే విషాద శ్రుతులు. మరోమారు బేరసారాలు సాగిస్తున్నారు పెళ్ళి చూపులకొచ్చిన పెద్దలు. అదీ తన కళ్ళ ముందే తన తండ్రి ఆ మొత్తం తగ్గించమని ప్రాధేయపడుతున్నాడు వాళ్ళని. తనలో ఉక్రోషం, ఏహ్యాభావం.

"మరి ఈ విషయంలో మీ అబ్బాయి అభిప్రాయం?" వాళ్ళను నిలదీసినట్లు తన ప్రశ్న.

"వాడి దేముందమ్మా, మేమెట్లా చెప్తే వాడట్లా."

"చూడండి. ఇంత వ్యక్తిత్వం లేని చలిమిడి ముద్దను, ఆడది తెచ్చే డబ్బుపై ఆశలు పెంచుకొన్న వాణ్ణి నేను మాత్రం ఎట్లా చేసుకుంటాననుకొన్నారు? వెళ్ళండి; ఇప్పటికైనా మీ అబ్బాయి కళ్ళ గంతలు విప్పి వెలుగు చూపండి."

ఇలాంటివి ఎన్ని? ఇవన్నీ చూడలేనట్లు దిగులుతో కుమిలి కుమిలి కన్నుమూసిన తల్లిదండ్రులు ఏ విధమైన అండదండలూ, ఆప్యాయతతో ఆదరించే బంధువులూ లేక జీవితం వెలితి వెలితిగా ఇరుకు ఇరుకుగా... భవిష్యత్తు మసకమసకగా.... కణతలు నొక్కుకొంది బాధగా సుజాతమ్మ. గతం వర్తమానమై, వర్తమానం భూతమై సుజాతమ్మను అశాంతిపాలి చేస్తోంది.

మనిషికి అందం గూర్చిన అహం ఎంతగా కళ్ళను పొరలుగా కమ్మేస్తుందో ఆ తర్వాత ఎంతగా బాధ పెడుతుందో సుజాతమ్మకు తెలిసివచ్చింది. అన లింతకూ తన రూపాన్ని అదే పనిగా రెచ్చగొట్టి తనలో పట్టపగ్గాల్లేకుండా అహంకారాన్ని పెంచి పెద్ద చేసిన వనజ, సరోజలు సుజాతమ్మ కళ్ళ ముందు నిల్చారు. తన బ్రతుకులోని ఇంతటి కల్లోలానికీ, అసంతృప్తికీ వాళ్ళే కారకులు.

"అబ్బ; ఎంత అందమే నీది? నిన్ను చూస్తుంటే చచ్చే ఈర్ష్యగా ఉంది. పాల మీగడలా పరవళ్ళు తొక్కే ని న్నందుకునే వా డెవడో కాని ఎంత తపస్సు చేసుకొని పుట్టాడో' అంటూ వనజ ఎంతగా రెచ్చగొట్టింది ఆనాడు తనని.

"సుజాతా ! వనజ చెప్పింది నిజమేనే; నిజంగా నువ్వు మెరుపు తీగవే! నీ అందంముందు మోకరిల్లనిమగవెధవ ఎవడైనా ఉంటాడా? సినిమాల్లో చేరిపోగూడదటే...." సరోజ నొక్కిన నన్నాయిలు.

ఇంతగా ఉపదేశం చేసిన వనజ ఎవణ్ణో లేవదీసుకు వెళ్ళిపోయింది. ఇహ సరోజ తలొంచుకొని బుద్ధిగా తాళి గట్టించుకొంది. అనాకారి పాపిష్టి జీవ్వేలు గుర్తుకొస్తేనే ఒళ్ళు మండుకొస్తోంది.

సుజాతమ్మకు ఏడుపొస్తున్నది. కట్టలు తెగివచ్చే నదిలా ఈ ప్రపంచాన్ని కన్నీటితో ముంచి వేయాలన్న దుఃఖం. సుజాతమ్మ మనసులో సంచలిస్తున్న కాలం చెల్లిన స్వప్నాకృతులు. నిస్త్రాణంగా, కమ్ముకొస్తున్న అలసటతో కళ్ళు మూతలు పడుతున్న సుజాతమ్మకు గోడవతలి మామ్మగారి ఆక్షేపణలు, అరుపులు లీలగా వినిపిస్తున్నాయి.

"ఎన్నిసార్లు చెప్పినా వడిలిపోయిన వంకాయలు, ముడుచుకుపోయిన ఆకు కూరలూ తప్ప మంచివి తేవుగదరా!"

"నన్నేం చేయమంటావ్? పొద్దున్నే పంపమంటే పంపవు; అప్పుడైతే మంచివి దొరుకుతై" అంటున్న మనుమడు వాణ్ణి ఏమీ అనలేక మామ్మగారి సణుగుడు.

మామ్మగారి మనుమడి మాటలు విన్న సుజాతమ్మ మనసులో అంతులేని కల్లోలం. ఆ కల్లోలం నుంచి విఫలమయిన తన అన్వేషణ తాలూకు జ్ఞాపకాలు.

అవును మరి; మార్కెట్‌లో మంచి వస్తువు నిలవ ఎందుకుంటుంది? దానికి గిరాకీ ఉంటుంది. ఎవరో ఒకరు పోటీ పడి తీసుకుపోతా రు. అన్ని సద్గుణాలూ, మంచి రూపం ఉన్న యువతీ యువకులు మాత్రం పెళ్ళిళ్ళ మార్కెట్‌లో ఎందుకు మిగిలిపోతా రు? ఎవరు మిగలనిస్తారు? అర్థం లేని అహంతో, పిచ్చి పంతంతో వచ్చిన అవకాశాల న్నింటినీ తనలాగే మరొకరు ఎందుకు జారవిడుచుకుంటారు? సమయం దాటిన తర్వాత, వయసు వాలిం తర్వాత ఎంత ఆరాటపడినా మంచి వస్తువు దొరకటం ఎంత దుర్లభం-

సుజాతమ్మ అంతరంగంలో క్షోభ; నిరాశలనుంచి విముక్తం చేస్తూ వెన్నెల గూటిలో నుండి మమతల తరగలు ఎగిసిపడ్డట్లు రాధ ఉపశమన వచనాలు ఆమె మనసును సాంత్వనపరిచాయి.

"సుజాతా ! ఎవరో ఏదో చెప్పారని గాక, మన దగ్గరకు మనసారా వచ్చిన ఆ వ్యక్తిని మనం అర్థం చేసుకోవడానికి, ప్రయత్నించాలి. ఆ వ్యక్తి పార్శ్వకోణాన్నే గాక, సంపూర్ణ అంతర్యాన్ని తెలుకోగలిగాలి. ఎదుటి వ్యకిని గురించి మనం పెంచుకొనే అపోహలు, పరిస్థితిని మరింత జటిలం చేస్తాయే తప్ప పరిష్కారానికి తోడ్పడవు. పెళ్ళికి ముందు అతి బుద్ధిమంతుడైన వ్యక్తి మన అదృష్టం తిరగబడి ఆ తర్వాత అన్ని వ్యసనాలకూ దాసోహమైతే మనం చేయగలిగిందేమిటి? అందుకని, సుజాతా ! జరి గిందేదో జరిగిపోయింది. ఇప్పటికీ మించిపోయింది లేదు.

"నీలాగా, నాలాగా మూడు పదులు దాటినా అవివాహితలుగా ఉండి, ఆ తర్వాత తనవాడనుకునే వ్యక్తి తోడు కోసం ఉపశమనం కోసం పెళ్ళిళ్ళు చేసుకుని చక్కగా కాపురాలు చేసుకుంటున్నారు చాలా మంది. అనలు ఈనాడిది సర్వసాధారణం కూడా. నీవూ కాస్త ఆలోచించు. ఎన్ని ఉన్నా తనవాడనే వ్యక్తి ఇల్లు స్త్రీకి అవసరం."

"నా విషయంలో అది సాధ్యమేనంటావా రాధా!" తనలోనూ కొట్టుకులాడే ఆశలకు సమాధానం అందుతుందేమో అన్న ఆరాటం.

"ఎందుకు సాధ్యం కాదు. అనలు ఈ రోజుల్లో విద్యావంతుల వివాహాలన్నీ పత్రికా ప్రకటనల ద్వారానే జరుగుతున్నాయి. నీ ఆశలు అభిలాషలకు తగ్గ వ్యక్తి కోసం పత్రికలో ప్రకటన వేయిద్దాం. ఇంకో రహస్యం. మా ఆయనే ఈ సలహా ఇచ్చింది. ఇక ఎంతమంది ఎగబడి నీతో వివాహానికి తరలి వస్తారో చూడు." ముత్యాల గింజలు రాలిపడ్డట్లుగా నవ్వింది రాధ.

ఆ నవ్వులో ఎంత స్వచ్ఛత ! ఎంత ఆత్మీయత ! స్నేహానికి ఆ నవ్వు అఖండ దీపిక.

సుజాతమ్మ కళ్ళ ముందటి దృశ్యం కరిగిపోయింది. వర్తమానం వెన్ను తట్టింది. ఒక్క క్షణం మైకం నుంచి తేరుకొన్నట్లుగా ఆమె మనసు జలదరించింది.

నిస్సారమూ, నిరర్థకమూ అనుకొన్న తన బ్రతుకులో శూన్యాన్ని దైన్యాన్ని పారద్రోలుతూ వెలుగులు చిమ్ముతున్న ఆశాదివ్వెలు వెలిగాయి సుజాతమ్మ కళ్ళ ముందు.

ఆ దివ్వెలే దీవెనలై, కళ్యాణ కానుకలై ఆమె అంతరంగాన్ని తొలిపొద్దు వెలుగులతో ఆహ్లాదపరిచాయి. ★

